

పశ్చిమాన డయేరియా కలకలం

పశ్చిమ ప్రకాశంలో డయేరియా విజృంభిస్తోంది. నాలుగు నెలల్లో 94 కేసులు నమోదయ్యాయి. ఒక్క ఈనెలలోనే 48 కేసులు వచ్చాయి.

- 8లో..



అనుమానాస్పద స్థితిలో రైల్వే ఉద్యోగి మృతి

రైల్వే గ్యాంగ్‌మెన్‌గా పనిచేస్తున్న వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం 33/28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

త్యాగాల స్మరణలో..



పొదిలిలో పీర్ల మిలాఖత్ ఉత్సవంలో ఊరేగుతున్న పీర్లు



తుమ్మలచెరువులో పెద్ద షరిగత్ సందర్భంగా విద్యుత్ వెలుగుల్లో దర్గా

మొహర్రం పర్వదినాన్ని జిల్లావ్యాప్తంగా ముస్లింలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముస్లిం వీరుల త్యాగాలను స్మరించుకుంటూ వేలాదిగా తరలి వచ్చి పీర్ల ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదులు, దర్గాలను ప్రత్యేకంగా అలంకరించారు.

దేవదేవునికి తొలిపూజలు..



పామూరులోని సత్యనారాయణ స్వామి దేవస్థానంలో మూలవిరాట్ మూర్తులు



సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా బుధవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. వేకువజాము నుంచే వేలాదిగా భక్తులు తరలివెళ్లి వైకుంఠవాసుని దర్శించుకున్నారు. పలు శైవక్షేత్రాల్లోనూ ప్రత్యేక అభిషేకాలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్

న్యూస్‌రీల్

కారంచేడు ఉద్యమ ఫలితమే దళితుల ఆత్మగౌరవం

- ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ



క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఆర్‌పీఎస్, వివిధ ప్రజాసంఘాల నాయకులు

ఒంగోలు సెంట్రల్:

కారంచేడు మృతవీరుల త్యాగ ఫలితమే నేడు దళిత బహుజనుల ఆత్మగౌరవ ప్రతీక అని ఎంఎస్ఎస్ జిల్లా కన్వీనర్ తోరటి ఆనంద్‌మాదిగ పేర్కొన్నారు. ఒంగోలులోని అంబేద్కర్ భవన్‌లో కారంచేడు మృతవీరుల 39వ సంస్మరణ సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి భిక్షాలు మాదిగ మాట్లాడుతూ మాదిగలపై ఆనాడు అగ్రవర్ణాలు చేసిన మారణకాండకు 39 ఏళ్లు గడిచిందని తెలిపారు. వారి నెత్తుటి స్ఫూర్తితోనే నేడు దళిత ఉద్యమాలు, మానవతా ఉద్యమాలు, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి లాంటి ఉద్యమాలు పుట్టాయని అన్నారు. సమాజంలో కులంపేరు చెప్పుకునేందుకు భయపడే రోజుల నుంచి కులాన్ని ఆత్మగౌరవ నినాదంగా ముందుకు తీసుకొచ్చిందన్నారు. కారంచేడు దుర్ఘటన దేశవ్యాప్తంగా ఎందరో దళితులు వారి ఆత్మగౌరవాన్ని పెంపొందేంచేందుకు దోహదపడిందన్నారు. అనంతరం అంబేద్కర్ భవనం నుండి చర్చి సెంటర్, కలక్టరేట్ మీదుగా అంబేద్కర్, బాబుజగజ్జీవన్ రామ్ విగ్రహం వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఒంగోలు నియోజకవర్గ ఎంఆర్‌పీఎస్ కన్వీనర్ తిరువీధుల బాబు మాదిగ, జిల్లా ఉద్యోగుల సంఘం కోశాధికారి జాలరావ్, తమ్ములూరి కిషోర్, జిల్లా మాదిగ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి లక్కెనబోయిన కోటేశ్వర రావు, వివిధ సంఘాల నాయకులు ఆనాల సురేష్, బాలాజీ, కోటేశ్వరరావు, సుబ్బారావు, పాడిబండ్ల బాబురావు, కొలకలూరి రవీంద్ర, ఆంజనేయులు, నారాయణ, విజయకుమార్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు కలవరం

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా పంటలు సాగుచేసుకోవాలనుకునే కౌలు రైతులకు ప్రభుత్వ సాయం అందని ద్రాక్షగానే ఉంది. బ్యాంకులు రుణాలు ఇవ్వాలంటే కౌలు రైతు గుర్తింపుకార్డులు తప్పనిసరి. కానీ కౌలు కార్డుల జారీ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. కొత్త ప్రభుత్వంలో ఇంత వరకు లక్ష్యంలో పదో వంతు కూడా పూర్తికాలేదు. ఈ ప్రభుత్వంలో పాలసీలు మారితే తమకు రుణాలు వస్తాయో లేదోనన్న ఆందోళన కౌలు రైతుల్లో నెలకొంది. బయట అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకుని పంటలు సాగుచేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- నత్తనడకన సాగుతున్న కౌలుకార్డుల జారీ
- బ్యాంక్ రుణాల కోసం కౌలు రైతుల ఎదురు చూపులు
- సాగు పెట్టుడులకు చేతిలో డబ్బులేక అగచాట్లు



ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు

జిల్లాలో గత ఏడాది మంజూరైన కౌలు కార్డులు : 33,041

ఈ ఏడాది కౌలు కార్డుల లక్ష్యం: 45

ఇప్పటి వరకు ఇచ్చింది: 1499

మార్కాపురం:

జిల్లా వ్యాప్తంగా కౌలురైతుల కార్డుల మంజూరు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. రెవెన్యూ, వ్యవసాయాధికారులు సంయుక్తంగా గ్రామాల్లో సమావేశాలు పెట్టి కౌలు రైతులను గుర్తించి కార్డులు ఇవ్వాలి. వీటి ద్వారా బ్యాంకు మేనేజర్లు పంటలు సాగుచేసుకునేందుకు రుణాలు అందిస్తారు. జిల్లాలో ఒంగోలు, మార్కాపురం, కనిగిరి రెవెన్యూ డివిజన్‌లో గతేడాది మొత్తం 33,041 కౌలు రైతుల కార్డులు మంజూరు చేయగా రైతులు బ్యాంకుల ద్వారా రుణాలు పొందారు. అయితే ఈ ఏడాది ఈ కార్యక్రమం అరకొరగా సాగుతోంది. ఈ ఏడాది 45 వేల మందికి కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ ఇప్పటి వరకు ఇచ్చింది కేవలం 1499 మందికి మాత్రమే. అందరికీ కార్డులు అందేసరికి సీజన్ దాటిపోయేలా ఉంది. దీంతో కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఓ వైపు ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా వర్షాలులేక ఇబ్బంది పడుతుండగా, మరో వైపు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందుతుందో లేదో తెలియక అయోమయంలో ఉన్నారు. ప్రభుత్వం మారడంతో పాలసీ కూడా మారి తమకు బ్యాంకర్ల రుణాలు ఇస్తారో.. లేదోనన్న సందేహం రైతుల్లో నెలకొంది. గత ప్రభుత్వం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించి పొలాలు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్న రైతులను ఆదుకోవాలనే లక్ష్యంతో కౌలు రైతు గుర్తింపు కార్డులు అందించింది. కౌలు రైతులకు సబ్సిడీ విత్తనాలు, బ్యాంకు రుణాలు, పంటనష్ట పరిహారం, పంట ఉత్పత్తుల విక్రయాలకు కౌలు రైతుల గుర్తింపు కార్డులు తప్పనిసరి.

గత ఏడాది మార్కాపురం డివిజన్‌లోని 13 మండలాల్లో కౌలు రైతులు 10,099 మందికి గుర్తింపు కార్డులు ఇచ్చారు. ఈ ఏడాది 15,268 మంది రైతులకు కౌలురైతుల కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా 513 మందికి మాత్రమే కార్డులు అందాయి. మార్కాపురం వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. మొత్తం సబ్‌డివిజన్ పరిధిలో మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు, కంభం, అర్ధవీడు మండలాల పరిధిలో ఖరీఫ్‌లో 53,260 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఇందులో 37,715 ఎకరాలు వర్షాధారం కింద, 15,550 ఎకరాలు బోర్ల కింద సాగు చేస్తారని అంచనా.

ఎకరా పత్తి సాగు చేయడానికి దాదాపు రూ.25 నుంచి రూ.30 వేలు ఖర్చవుతుంది. ఈ నేపథ్యంలో కౌలు రైతులు బ్యాంకు రుణాల కోసం ఎదురు చూస్తున్నారు. బ్యాంక్ మేనేజర్లు వ్యక్తిగత రుణాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో ఖరీఫ్ సీజన్‌లో కౌలు రైతులు పంటలు సాగు చేయాలంటే మళ్లీ అధిక వడ్డీకి అప్పులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కౌలు కార్డులు వెంటనే ఇవ్వాలి



ఖరీఫ్ సీజన్ మొదలై నెల రోజులు గడుస్తున్నాయి. వెంటనే రైతులకు కౌలు కార్డులు మంజూరు చేయాలి. కౌలు కార్డులు వెంటనే ఇవ్వకపోతే కౌలు రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని అధికారులు కౌలు కార్డుల మంజూరులో జాప్యం లేకుండా చూడాలి. వీఆర్వోల దగ్గరకు వెళ్తే అదుగో ఇదుగో అంటున్నారు. యజమానుల పత్రాలను పరిశీలించి, కౌలు రైతులకు న్యాయం జరిగేలా కౌలు కార్డులు వెంటనే మంజూరు చేయాలి.

– ఎద్దు నగేష్, రామాపురం

రుణం మంజూరయ్యేలా చూడాలి



ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా కౌలు కార్డులు మంజూరు చేయకపోవటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కౌలు కార్డులు సత్వరమే మంజూరు చేయటంతో పాటు, కౌలు రైతులకు రుణం వచ్చేలా చర్యలు తీసుకోవాలి. సబ్సిడీ విత్తనాలు పొందాలన్నా కౌలు కార్డు అవసరమవుతుంది. పంట నష్టపరిహారం కోసం, పంట ఉత్పత్తుల విక్రయాల కోసం కౌలు కార్డులు అవసరం. కౌలు కార్డులు వెంటనే మంజూరు చేయటంతో పాటు, ప్రభుత్వం నుంచి వచ్చే ఇతర రాయితీలన్నీ కౌలుదారులకు చెందేలా చర్యలు తీసుకోవాలి.

– వెలుగు నరసింహారావు, ఈగలపాడు

మండలం	ఆర్‌బీకేలు	గ్రామాలు	గతేడాది కౌలు రైతులు	ఈ ఏడాది లక్ష్యం	ప్రస్తుతం ఇచ్చిన కౌలుకార్డులు
మార్కాపురం	24	23	825	1752	25
అర్ధవీడు	12	13	628	877	24
బేస్తవారిపేట	16	21	981	1169	0
కంభం	14	16	924	1023	38
దోర్నాల	12	19	798	877	33
గిద్దలూరు	20	22	1165	1461	161
కొమరోలు	13	21	817	950	92
పెద్దారవీడు	14	16	696	1023	05
పుల్లలచెరువు	18	18	826	1314	71
రాచర్ల	13	14	684	950	28
త్రిపురాంతకం	21	18	599	1534	27
యర్రగొండపాలెం	21	33	471	1534	0
తర్లుపాడు	11	26	685	804	9
కనిగిరి డివిజన్	207	383	11437	15123	630
ఒంగోలు డివిజన్	200	222	11505	14609	356

బీజేపీతో రాజ్యాంగానికి ప్రమాదం

- ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు టి.లక్ష్మీ నారాయణ



లౌకిక ప్రజా స్వామ్య పరిరక్షణ సభలో మాట్లాడుతున్న లక్ష్మీ నారాయణ

ఒంగోలు టౌన్: మతతత్వ భావజాలం కలిగిన బీజేపీతో దేశ రాజ్యాంగానికి ప్రమాదం పొంచి ఉందని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు టి.లక్ష్మీ నారాయణ అన్నారు. ఆసరా ఆధ్వర్యంలో మల్లయ్య లింగం భవనంలో ''మోదీ 3.0 ప్రభుత్వం–లౌకిక ప్రజాస్వామ్య పరిరక్షణ'' అనే అంశం మీద నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. 2014, 2019లలో సింగిల్ పార్టీగా గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బీజేపీ 2024లో మైనారిటీలో పడిపోయింది కనుక దాని పని అయిపోయిందనుకోవడం పొరపాటన్నారు. బెంగాల్, కేరళ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో గణనీయంగా ఓటింగ్ శాతం పెంచుకుందని, త్రిపుర, ఒడిశా రాష్ట్రాల్లో ప్రభుత్వాలను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు సభకు ఆసరా కేంద్రం అధ్యక్షుడు చిడిపోతి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా నాతోని భూపతిరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. సభలో ప్రజానాట్య మండలి గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు, ఆసరా సభ్యులు సుబ్రహ్మణ్యం, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు, పీవీఆర్ చౌదరి, పావులూరి అంజయ్య పాల్గొన్నారు.

కంప్యూటర్, ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణ

ఒంగోలు: నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్యాలీ, జీఎస్టీతో పాటు కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌లో అత్యుత్తమ ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. 18 నుంచి 28 ఏళ్ల మధ్య వయసున్న వారు మాత్రమే అర్హులని, 35 రోజుల శిక్షణ కాలంలో భోజనం, వసతి కల్పిస్తామని తెలిపారు. శిక్షణ అనంతరం 100 శాతం వివిధ సంస్థల్లో కనీస నెలసరి జీతం రూ.15 వేలతో ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9000487423 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సారొస్తున్నారు.. మీరు ఆగండి !



శివాలయం సెంటర్ నుంచి ఎమ్మెల్యే వాహనాలు వెళ్తున్న సమయంలో ట్రాఫిక్ నిలుపుదల చేసిన దృశ్యం

- ఎమ్మెల్యే దామచర్ల కార్యక్రమాలుంటే నగర ప్రజలకు ఇక్కట్లే..
- గంటలకొద్దీ ట్రాఫిక్ నిలుపుదల

ఒంగోలు టాస్క్‌ఫోర్స్: స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావుకు నగరంలో కార్యక్రమాలుంటే నగర ప్రజలకు ఇక్కట్లు తప్పటం లేదు. ఎమ్మెల్యే వాహనాలు వెళ్లే మార్గంలో ట్రాఫిక్ నిలుపుదల చేస్తుండటంతో గంటల కొద్దీ వాహనదారులు అవస్థలు పడుతున్నారు. బుధవారం నగరంలో ఎమ్మెల్యే పలు కార్యక్రమాల్లో పాల్గొనగా కార్యక్రమాలు జరిగిన ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్ నిలుపుదల చేయడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. శివాలయం సెంటర్‌లో కార్యక్రమానికి హాజరైన దామచర్ల వాహనాలు వెళ్లే వరకు ఆ మార్గంలో వెళ్లే వాహనదారులను పోలీసులు నిలిపేశారు. అదేవిధంగా భాగ్యనగర్ 3వ లైన్ వద్ద జరిగిన కార్యక్రమానికి వచ్చిన సమయంలోను ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. వాహనాలు నిలిపే ప్రక్రియలో పోలీసులు వాహనదారులతో కొంత దురుసుగా కూడా ప్రవర్తించడం గమనార్హం.

నేరాల నియంత్రణలో రాజీలేదు

- బాధ్యతలు చేపట్టిన ఎస్పీ ఏఆర్ దామోదర్



మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: నేరాల నియంత్రణలో ఎటువంటి రాజీపడేది లేదని ఎస్పీ ఏఆర్ దామోదర్ స్పష్టం చేశారు. నూతన ఎస్పీగా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ట్రాఫిక్ సమస్య, మాదక ద్రవ్యాల నిరోధం, సైబర్ నేరాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు తెలిపారు. గంజాయిని అరికట్టేందుకు తల్లిదండ్రులు, కాలేజీ యాజమాన్యాలు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. నేరాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రోత్సహించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, ప్రణాళికాబద్ధంగా ట్రాఫిక్ సమస్యను క్రమబద్ధీకరిస్తామన్నారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు కృషి చేస్తామని, ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటామని తెలిపారు. జిల్లాను నేర రహితంగా మార్చేందుకు పోలీసు శాఖలోని అన్నీ విభాగాలను సమన్వయం చేసుకొని పనిచేస్తామన్నారు. పోలీసు సిబ్బంది సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇస్తానన్నారు. ఒంగోలు జిల్లాతో మంచి సంబంధం ఉందని, ప్రొబెషనరీ డీఎస్పీగా, ఒంగోలు పోలీసు ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశానని, విజయనగరం ఎస్పీగా కూడా పనిచేసినట్లు తెలిపారు.

అక్రమ కేసులు బనాయించవద్దు

ఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. విధి నిర్వహణలో ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గ వద్దని, ఎవరి మీదా అక్రమ కేసులు బనాయించవద్దని ఎస్పీ ఏఆర్ దామోదర్ అధికారులకు సూచించినట్లు తెలుస్తోంది. అనవసరంగా ఎవరినీ ఇబ్బంది పెట్టవద్దని, అన్యాయంగా ఎవరిమీదైనా పెట్టినా తరువాత మీరే ఇబ్బంది పడతారని స్పష్టం చేసినట్లు సమాచారం. రాజకీయాలకతీతంగా వ్యవహరించాలని, మీ పని మీరు చేసుకోండి అని చెప్పినట్లు తెలుస్తోంది.

అధికారుల అభినందనలు

నూతన ఎస్పీగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఏఆర్ దామోదర్‌కు అధికారులు అభినందనలతో ముంచెత్తారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, అడిషనల్ ఎస్పీ (క్రైం) ఎస్‌వీ శ్రీధర్ రావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్ బాబు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ కమిటీ ఎన్నిక

ఒంగోలు టౌన్: నగరంలోని కాపు కళ్యాణ మండపంలో జరుగుతున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఒంగోలు నగర 6వ మహాసభల్లో నూతన కమిటీని ఎంపిక చేశారు. కమిటీ అధ్యక్షుడిగా గడ్డం నరసింహ, కార్యదర్శిగా తేళ్ల విజయ కుమార్, ఉపాధ్యక్షులుగా సీహెచ్ సింహాద్రి, సహాయ కార్యదర్శులుగా రత్న కుమారి, కాకుమాను శ్రీదేవి, కె.సామ్రాజ్యం, పి.కోటేశ్వరరావు, కుంచాల వెంకటరావు ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా టి.మహేష్‌తో సహా మరో 32 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్ హెల్త్ అలవెన్స్ చెల్లించాలని కోవిడ్ కార్మికులను ఆప్కాస్ లోకి తీసుకోవాలని తీర్మానాలు చేశారు.

క్లుప్తంగా

నల్లమల ఘాట్ రోడ్డులో ప్రమాదం


రోడ్డుకు అడ్డంగా ఉండిపోయిన లారీ

గిద్దలూరు రూరల్: మండలంలోని దిగువమెట్ట గ్రామ సమీపంలోని నల్లమల ఘాట్ రోడ్డులోని పాత రైల్వే బ్రిడ్జి మలుపు వద్ద ప్రమాదవశాత్తు లారీ బ్రిడ్జి గోడలను ఢీకొట్టింది. ఈ సంఘటన గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే..నంద్యాల వైపు నుంచి గిద్దలూరు వైపుగా వస్తున్న లారీ ప్రమాదవశాత్తు బ్రిడ్జి గోడలను ఢీకొట్టింది. అదృష్టవశాత్తు ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. లారీ రోడ్డుకు అడ్డంగా ఉండిపోవడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రోడ్డుకు అడ్డంగా ఉన్న లారీని తొలగించే చర్యలు చేపట్టి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు.

పొలాల్లో పులి అడుగులు..?


రాచర్లఫారంలోని వ్యవసాయ పొలాల్లో చిరుతపులి అడుగుల ఆనవాళ్లు

రాచర్ల: మండలంలోని రాచర్ల పంచాయతీ పరిధిలోని రాచర్లఫారం వ్యవసాయ పొలాల్లో చిరుత పులి అడుగులు కలకలం రేపాయి. పులి సంచరిస్తున్న అడుగులను గుర్తించిన రైతులు భయాందోళనకు గురై గిద్దలూరు అటవీ శాఖాధికారులకు సమాచారాన్ని అందించారు. గిద్దలూరు ఫారెస్టు ఎఫ్ఎస్ఓ షేక్.జామాల్‌సాహెబ్, శ్రీనివాసరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని అడుగులు పరిశీలించారు. అడుగులను బట్టి పరిశీలిస్తే చిరుత పులివా లేదా మరో జంతువుకు సంబంధించిన అడుగులా అనే కోణంలో అనుమానం వ్యక్తం చేశారు. రాచర్లఫారం గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి రెండు రోజులు పాటు పరిశీలించి చూస్తామని, పులి సంచరిస్తున్నట్లు వాటి ద్వారా గుర్తించి వెంటనే బోన్లను ఏర్పాటు చేసి బంధిస్తామని తెలిపారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా పొలాలకు వెళ్లేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు వివరించారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మృతి

దొనకొండ: వేగంగా వెళ్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన రామాపురం–బసిరెడ్డి పల్లె రహదారి మధ్యలో జరిగింది. రామాపురం గ్రామానికి చెందిన పెమ్మసాని నాగేశ్వరరావు, భార్య రవణమ్మ కొచ్చెర్లకోట నుంచి స్వగ్రామమైన రామాపురం వెళ్తున్నారు. అదే సమయంలో రామాపురానికి చెందిన ముట్టె శివ మోటార్ సైకిల్‌పై వేగంగా వెళ్తూ ఢీకొట్టాడు. దీంతో నాగేశ్వరరావు, ఆయన భార్య రవణమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం మార్కాపురం ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా నాగేశ్వరరావు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సంపత్‌కుమార్ తెలిపారు.

పశ్చిమాన డయేరియా కలకలం

పశ్చిమ ప్రకాశంలో డయేరియా కలకలం రేపింది. నిత్యం పదుల సంఖ్యలో కేసులు నమోదవుతుండటం ఆందోళనకు గురి చేస్తోంది. డయేరియా బారినపడి వాంతులు, విరేచనాలతో బాధపడుతూ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. నిత్యం ఆస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య పెరిగిపోతోంది. కలుషిత నీరు, కలుషిత ఆహారం తీసుకోవడం వల్ల డయేరియా వ్యాపిస్తోంది. ముఖ్యంగా పశ్చిమ ప్రకాశంలో పెరుగుతున్న కేసులతో వైద్యాధికారులు సైతం ఆందోళనకు గురవుతున్నారు.

- నాలుగు నెలల్లో 94 కేసులు నమోదు
- ఈ నెలలో ఇప్పటి వరకు 43 కేసులు
- జీజీహెచ్‌లో ప్రత్యేక డయేరియా వార్డు


డయేరియా రోగికి చికిత్స అందిస్తున్న డాక్టర్ రామారావు

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలోని డయేరియా విజృంభిస్తోంది. డయేరియాతో వాంతులు, విరోచనాలతో బాధపడుతూ నిత్యం ఆస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోంది. పదుల సంఖ్యలో రోగులు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని వివిధగ్రామాల నుంచి డయేరియా బాధితులు మార్కాపురంలోని జీజీహెచ్‌లోని ప్రత్యేక డయేరియా వార్డుకు వచ్చి చికిత్స పొందుతున్నారు. కలుషిత నీరు, కలుషిత ఆహారం తినడం వల్ల డయేరియా వ్యాపిస్తోంది. గ్రామాల్లో నీటి ఎద్దడి కారణంగా తప్పనిసరి పరిస్థితుల్లో, అపరిశుభ్రమైన వాతావరణంలో ప్రజలు బోర్ల నుంచి ట్యాంకర్ల ద్వారా, వాటర్ ప్లాంట్ల ద్వారా నీటిని తాగుతున్నారు. దీంతో డయేరియా బారిన పడుతున్నారు. ఏప్రిల్ నుంచి జూలై 15 వరకూ 94 డయేరియా కేసులు ఒక్క జీజీహెచ్‌లోనే నమోదయ్యాయి. వీరుకాక ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొంది ఇళ్లకు చేరిన వారు కూడా సుమారు 100కు పైగా ఉన్నారు.

డయేరియా సోకిన గ్రామాలు ..

మార్కాపురం పట్టణంతోపాటు మండలంలోని కోలభీమునిపాడు, ఇడుపూరు, దరిమడుగు,

నెల	నమోదైన కేసులు
ఏప్రిల్	20
మే	14
జూన్	17
జూలై(15వ తేదీ నాటికి)	43

వేములకోట, తిప్పాయపాలెం, రాజుపాలెం, యాచవరం, కంభం మండలంలోని లింగాపురం, పెద్దారవీడు మండలంలోని కలనూతల, సుంకేశుల, దొనకొండ మండలంలోని కొచ్చెర్లకోట, తర్లుపాడు తదితర గ్రామాల నుంచి డయేరియా బాధితులు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు.


జీజీహెచ్‌లోని డయేరియా వార్డు

ప్రత్యేక వార్డు ఏర్పాటు..

వేసవికాలం ముగింపు, వర్షాకాల ప్రారంభంలో డయేరియా ఏటా వ్యాపిస్తోంది. గత రెండేళ్ల నుంచి పశ్చిమ ప్రకాశంలో డయేరియా కేసులు తక్కువ సంఖ్యలో నమోదయ్యాయి. అయితే ఈ ఏడాది నీటి ఎద్దడి గ్రామాల్లో ఎక్కువగా ఉండటం, తాగునీటి కోసం ప్రజలు అపరిశుభ్రమైన వాతావరణంలో ఉన్న బోర్లు, కుంటల నుంచి నీళ్లతెచ్చుకుని తాగడం, నిల్వ ఉన్న ఆహారాన్ని తినడం వలన డయేరియా కేసులు నమోదవుతున్నాయి. దీంతో బాధితుల కోసం మార్కాపురంలోని జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా డాక్టర్‌ను, సిబ్బందిని నియమించారు. 20 బెడ్లతోపాటు 50 మందికి సరిపడా మందులను అందుబాటులో ఉంచారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



డయేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కాచి చల్లార్చిన నీటినే తాగాలి. నిల్వ ఉంచిన ఆహారాన్ని, జంక్ ఫుడ్స్‌ను దూరంగా ఉంచాలి. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి. రెండు మూడు సార్లకంటే ఎక్కువ వాంతులు విరోచనాలైతే వెంటనే వైద్యశాలకు రావాలి. డయేరియా పేషంట్ల కోసం ప్రత్యేక వార్డుతోపాటు ప్రత్యేక డాక్టరును కూడా నియమించాము. జాగ్రత్తలు తీసుకుంటే డయేరియా రాదు. ఆహారం తినే సమయంలో చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. ఈగలు, దోమలకు దూరంగా ఉండాలి. ఆహారాన్ని వేడిగా తినండి, ఒక వేళ డయేరియా సోకినా భయపడవద్దు. వెంటనే వైద్యశాలకు వచ్చి చికిత్స చేయించుకోవాలి. ఆలస్యం చేయవద్దు.

– డాక్టర్ పి. సావిత్రి, సూపరింటెండెంట్, జీజీహెచ్ మార్కాపురం

అనుమానాస్పద స్థితిలో రైల్వే ఉద్యోగి మృతి


సంఘటనా స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై


మృతదేహాన్ని కొండపై నుంచి కిందకు దించుతున్న బంధువులు


రోధిస్తున్న భార్య

- మృతుడు కంభం రైల్వేస్టేషన్‌లో గ్యాంగ్‌మెన్
- నాలుగు నెలల క్రితమే బంధువుల అమ్మాయితో వివాహం
- గుర్తుపట్టలేని స్థితిలో రావిపాడు రోడ్డులోని కొండపై మృతదేహం లభ్యం

కంభం: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం రావిపాడు రోడ్డులోని కొండపై వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే..బాపట్ల జిల్లా మార్టూరు మండలం ద్రోణాదుల గ్రామానికి చెందిన గద్దల సురేష్(27) రైల్వేలో గ్యాంగ్‌మేన్ గా పనిచేస్తున్నాడు. ఇటీవల బదిలీపై కంభం రాగా నాలుగు నెలల క్రితం బంధువుల అమ్మాయితో వివాహమైంది. భార్య, తల్లితో కలిసి కంభంలో నివాసముంటున్నాడు. గత నెల 17వ తేదీన ఇంట్లో ఉన్న సమయంలో ఉదయం 11 గంటలకు ఫోన్ రాగా ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. ఎంతసేపటికి తిరిగి రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో నెల రోజుల తరువాత బుధవారం రావిపాడు రోడ్డులోని శ్మశానం వద్ద కొండపై మృతదేహాన్ని గుర్తించి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.


మృతుడు గద్దలసురేష్ (ఫైల్)

హత్యా..ఆత్మహత్య..?

ద్రోణాదులకు చెందిన కోటయ్యకు ఇద్దరు కుమారులు కాగా మృతుడు రమేష్ చిన్నవాడు. తన కుమారుడికి ఎవరితో గొడవలు లేవని, చాలా మంచివాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. నాలుగునెలల క్రితం బంధువుల అమ్మాయితో పెళ్లి చేశామని, ఇంతలోనే ఇలా జరిగిందని తల్లిదండ్రులు రోధిస్తున్నారు. అయితే ఇంట్లో ఉన్న సమయంలో ఫోన్ ఎవరు చేశారు..? ఆ ఫోన్ వచ్చిన వెంటనే ఎందుకు వెళ్లాడు ఆ తర్వాత ఏం జరిగిందన్నది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. మృతదేహం ఉన్న పరిసరాల్లో ఎటువంటి ఎటువంటి అనుమానాస్పద వస్తువులు కన్పించలేదు. అక్కడికి వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడా, ఎవరైనా తీసుకెళ్లి హత్య చేశారా అన్న విషయాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. కుమారుడికి మృతికి కారణమేంటో విచారించి తమకు న్యాయం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. సంఘటనా స్థలంలో మృతుడి భార్య, కుటుంబసభ్యులు బోరున విలపించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీసుల తీరుపై అసహనం..

రమేష్ కనిపించడం లేదని ఫిర్యాదు చేసి నెల రోజులు కావస్తున్నా పోలీసులు జాడ కనిపెట్టలేక పోయారని మృతుడి కుటుంబసభ్యులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజుల క్రితం ఓ ద్విచక్రవాహనం కనిపించగా బండిపై ఉన్న నంబర్ సహాయంతో బండి యజమానికి ఫోన్ చేయగా బండి రమేష్‌కు కొంతకాలం క్రితం విక్రయించినట్లు తెలియడంతో వాహనం మృతుడిగా గుర్తించి పోలీసులు బండిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. మృతుడి బండి దొరికిందన్న విషయం తెలుసుకున్న మృతుడి తాత సుబ్బారావు బుధవారం పక్కనే కొండపైన పరిసరాల్లో వెతుకుతుండగా కొండపై గుర్తుపట్టలేని స్థితిలో ఉన్న మనవడి మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు స్వగ్రామం నుంచి భారీగా తరలివచ్చారు. అయితే పోలీసులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బంధువులు వాపోయారు.

ఆస్తి కోసం తండ్రిపై హత్యాయత్నం


తీవ్ర గాయాలైన వెంకటేశ్వరరావు

ఒంగోలు టౌన్: ఆస్తి కోసం కన్నతండ్రిపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు ఓ కుమారుడు. పోలీసుల కథనం ప్రకారం ..నగరంలోని శ్యాంప్రసాద్ థియేటర్ రోడ్డులోని పాత మార్కెట్ వద్ద నివాసం ఉంటున్న యార్లగడ్డ వెంకటేశ్వర్లుకు ఇద్దరు కుమారులు. ప్రస్తుతం ఆయన తన చిన్న కుమారుడి కుమారుడైన రవితేజ వద్ద ఉంటున్నారు. తండ్రిలేని బిడ్డ అయిన రవితేజకు 8 నెలల క్రితం తన ఆస్తిని రిజిస్టర్ చేశారు. ఇది మనసులో పెట్టుకొని కక్ష పెంచుకున్న పెద్ద కుమారుడు రమేష్ తరుచూ వేధిస్తుండేవాడు. బుధవారం రవితేజ వ్యక్తిగత పనుల నిమిత్తం విజయవాడకు వెళ్లాడు. దీంతో వెంకటేశ్వరరావు దుకాణం వద్ద కూర్చొని పొగాకు విక్రయిస్తుండగా పెద్ద కుమారుడు రమేష్ చేతిలో కత్తి పట్టుకొని వచ్చాడు. దుకాణంలో కూర్చొని ఉన్న తండ్రి వెంకటేశ్వరరావుపై కత్తితో దాడి చేశాడు. ప్రమాదంలో మెడ, భుజంపై గాయాలు చేసి పారిపోయాడు. చుట్టుపక్కల దుకాణల వాళ్లు రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం వెంకటేశ్వరరావు ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్, మోటార్ సైకిల్ ఢీ

సింగరాయకొండ: ట్రాక్టర్, మోటారు సైకిల్ ఢీకొన్న ఘటనలో సుందర్‌నగర్‌కు చెందిన మోటార్‌సైకిలిస్టు సుదర్శి హరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం స్థానిక గొల్లచెంచయ్య పెట్రోల్ బంకు సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..ఒంగోలు వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఎదురుగా వస్తున్న మోటార్‌సైకిల్ ఢీకొట్టడంతో మోటారుసైకిలిస్టు హరి ఎడమకాలికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని 108లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.శ్రీరాం తెలిపారు.

అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలి

- అధికార పార్టీ నాయకులకు పూర్తిగా కొమ్ముకాయడం మంచిది కాదు


పొన్నలూరులో సమావేశమైన సర్పంచులు, ఎంపీటీసీలు

పొన్నలూరు: అధికారులు టీడీపీ నాయకులకు కొమ్ముకాయకుండా పారదర్శకంగా వ్యవహరించి ప్రజలకు అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు. పొన్నలూరులో బుధవారం వైఎస్సార్‌సీపీ సానుభూతి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు అవుతున్నా గ్రామాల్లో టీడీపీ నాయకుల ఆగడాలు ఆగడం లేదన్నారు. అధికారులను అడ్డుపెట్టుకొని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బెదిరిస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు చెప్పిన విధంగా వినాలని ఒత్తిడి చేయడం దారుణమన్నారు. పంచాయతీల్లో సర్పంచులు, ఎంపీటీసీ హక్కులకు భంగం కలిగిస్తే ఐక్యంగా ఉద్యమిస్తామన్నారు. పంచాయతీల్లో జరిగిన అభివృద్ధి పనుల్లో పెండింగ్ బిల్లులు కాకుండా టీడీపీ నాయకుల మాటలకు తలొగ్గి పంచాయతీ కార్యదర్శులు వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. గ్రామాల్లో వాటర్ ప్లాంట్‌లను సర్పంచులకు చెప్పకుండా టీడీపీ నాయకులు వాటి తాళాలు పగలకొట్టి దౌర్జన్యం చేస్తుంటే సంబంధిత కార్యదర్శులు చర్యలు తీసుకోకుండా చోద్యం చూడటం సిగ్గుచేటన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని, మంత్రి స్వామి పేరుతో ఎప్పుడూ లేని విధంగా టీడీపీ నాయకులు మండలంలో విష సంస్కృతికి తెరతీస్తుంటే సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం సర్పంచుల సంఘం మండల అధ్యక్షులుగా అనుమోలు ప్రసాద్, ఉపాధ్యక్షులుగా పెరికా రమేష్, కార్యదర్శిగా కర్నా సావిత్రిని ఎన్నుకున్నారు. జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లపోలు బాలకోటిరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, సీనియర్ నాయకులు సిరిగిరి గోపాల్‌రెడ్డి, మన్నెం చినవెంకటేశ్వర్లు, దుద్దుగుంట మల్లికార్జునరెడ్డి, దాసరి రవి, చేవూరి పద్మనాభరెడ్డి, గడ్డం మాల్యాద్రి, కర్నా మస్తాన్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

కాలుజారి బావిలో పడి బీటెక్ విద్యార్థి మృతి

తాళ్లూరు(ముండ్లమూరు): మండలంలోని దారంవారిపాలెం గ్రామానికి చెందిన మేడగం చంద్రశేఖరరెడ్డి(21) బీటెక్ చదువుతున్న విద్యార్థి ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం..దారంవారిపాలెం గ్రామానికి చెందిన మేడగం చంద్రశేఖరరెడ్డి పంజాబ్‌లోని ఎల్‌పీయూ యూనివర్శిటీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఇటీవల సెలవులు ఇవ్వడంతో ఇంటికి వచ్చాడు. మంగళవారం సాయంత్రం పొలానికి వెళ్లాడు. పొలంలోని దిగుడు బావిలో నీరు తాగేందుకు దిగగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి మెట్లు తడిసి ఉండడంతో జారి బావిలో పడి ఈత రాకపోవడంతో మృతి చెందాడు. రాత్రికి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు బంధువుల ఇళ్లలో విచారించారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం మృతుని తండ్రి పొలానికి వెళ్లి చూడగా బావిలో మృతదేహం కనిపించింది. దీంతో కుటుంబసభ్యులు, చుట్టుపక్కల వారికి సమాచారం ఇచ్చి మృతదేహాన్ని బయటకు తీశారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏఎస్సై మోహన్‌రావు మృతదేహాన్ని పరిశీలించి ప్రమాదానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దర్శికి తరలించారు.


మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరిస్తున్న ఏఎస్సై మోహనరావు

టిప్పర్ ఢీకొని తండ్రి మృతి

- కుమార్తెకు తీవ్ర గాయాలు

చీమకుర్తి: టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో తండ్రి మృతి చెందగా..కుమార్తెకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనలో కొండపి మండలం కట్టావారిపాలెం గ్రామానికి చెందిన రావెళ్ళ వెంకట్రావు(57) అక్కడికక్కడే మృతి చెందాడు. బైకు వెనుక కూర్చున్న కుమార్తె శ్రావణి కాలు నుజ్జు నుజ్జయి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం సంతనూతలపాడు మండలం మద్దులూరు–కొండపి మధ్య జరిగింది. రావెళ్ల వెంకట్రావు తన కుమార్తెతో ఒంగోలు వెళ్లి ఆస్పత్రిలో చూయించుకొని తిరుగు ప్రయాణంలో మద్దులూరు మీదుగా స్వగ్రామం వెళ్తున్నారు. ఆ సమయంలో చీమకుర్తి నుంచి గ్రానైట్ డస్ట్‌తో వెళ్తున్న టిప్పర్ ముందు వెళ్తున్న రావెళ్ల వెంకట్రావు బైకును ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రావణిని ఒంగోలులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. వెంకట్రావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనా ప్రాంతాన్ని ఎస్సై దేవకుమార్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


టిప్పర్ కింద ఉన్న మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వైభవంగా పాలంకేశ్వరుడి తిరునాళ్ల


ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇస్తున్న వీరభద్రస్వామి, భద్రకాళి


పాలంకేశ్వరుడిని దర్శించుకుంటున్న భక్తులు

యర్రగొండపాలెం: దట్టమైన నల్లమల అభయారణ్యంలో కృష్ణానది ఒడ్డున వెలసిన పాలంక వీరభద్రస్వామి తిరునాళ్ల తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం వైభవంగా సాగింది. క్షేత్రంలో వెలసిన వీరభద్రస్వామి, భద్రకాళి అమ్మవార్ల దర్శనానికి ప్రకాశం, గుంటూరు, పల్నాడు, కృష్ణ, నంద్యాల జిల్లాలతో పాటు తెలంగాణలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు వేలాది మంది తరలి వచ్చారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామి క్షేత్రంలో అహ్లాదాన్ని కలిగించే సెలయేటి వద్ద భక్తులు స్వామికి తలనీలాలు సమర్పించి స్నానాలు చేశారు. ప్రధానంగా స్వామి దర్శనం అనంతరం భక్తులు సంతాన గడ్డె వద్ద క్యూ కట్టారు. అక్కడ సంతానం కోసం దంపతులు తమ దోసిళ్లు పడితే పంచలింగాలపై నుంచి నీటి బిందువులు జారువారుతాయి. ఈ బిందువులు దోసిళ్లలో పడితే తమకు సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. పాలంక క్షేత్రం వద్ద భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సీఐ రాములు నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు పర్యవేక్షించారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి భక్తులకు డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించారు.

క్లుప్తంగా

ఘనంగా సద్గురు నారాయణ తీర్థ జయంతి



పూజలో పాల్గొన్న కాలభైరవ ఉపాసకుడు సాయికుమార్

ఒంగోలు మెట్రో: సద్గురు నారాయణ తీర్థ 379వ జయంతి సందర్భంగా స్థానిక సంతపేట సాయిబాబా మందిరంలోని తీర్థులవారి మూలవిరాట్‌కు బుధవారం అభిషేకం, తరంగ స్వరార్చన, ప్రసాద వినియోగం కార్యక్రమాలు నిర్వహించారు. తరంగ స్వరార్చనలో పింగళ వెంకట సుబ్బయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కాలభైరవ ఉపాసకులు మైనంపాటి సాయికుమార్, యూవీ రత్నం, రామచంద్రయ్య, తూనుగుంట మల్లికార్జునరావు, సాయి పాద సేవకుడు అళహరి చంచలరావు వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది.

పందుల పెంపకందారులపై చర్యలు

గిద్దలూరు రూరల్ (బేస్తవారిపేట): 'మేం పక్కా లోకల్' శీర్షికతో బుధవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాసరావు స్పందించారు. గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలో గతంలో పందుల పెంపకందారులకు నోటీలివ్వడం, పందుల పెంపకం షెల్టర్‌లను గ్రామానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న డంపింగ్‌యార్డ్‌లో ఏర్పాటు చేసే కునే విధంగా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతం పట్టణంలో సంచరిస్తున్న పందుల పెంపకం దారులకు నోటీసులు జారీ చేసి పట్టణానికి 5 కిలో మీటర్ల దూరంలో పెంచుకునే విధంగా, లక్ష్మీనరసింహస్వామి ఆలయం సమీపంలో, రాచర్ల గేట్ సమీపంలోని రైల్వేట్రాక్ వద్ద బహిరంగ మలవిసర్జనలు జరుగకుండా చర్యలు తీసుకుంటామని కమిషనర్ పేర్కొన్నారు.

ఆరుగురు విద్యార్థులకు బస్‌పాస్‌లు

రాచర్ల: గిద్దలూరు పట్టణంలో వివిధ కళాశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు రాచర్ల గ్రామానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ (సామాజిక సేవ కార్యకర్త) ఉలాపు శివశంకర్ నాయుడు రూ.12 వేలు ఖర్చు చేసి గిద్దలూరు, తురిమెళ్ల, కంభం, అనుమలవీడు గ్రామాలకు చెందిన పవన్, సాకేత్, దీన కుమారి, మాకోబ్, రాణి, సుజాత అనే ఆరుగురు పేద విద్యార్థులకు బస్ పాసులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మురుగు కాల్వలో చెత్త తొలగింపు

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడులో సీజనల్ వ్యాధుల ప్రబలకుండా ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా మురుగుకాల్వల్లో పేరుకుపోయిన చెత్తను పంచాయితీ సిబ్బంది తొలగించారు. గ్రామంలోని ఖాళీ స్థలాలు, రోడ్లపై ఉన్న చెత్తను తొలగించారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని సీజనల్ వ్యాధులు రాకుండా ఆరోగ్యాలను కాపాడుకోవాలని కోరారు. పంచాయతీ సెక్రటరీ అచ్యుతరావు, వాటర్‌మెన్ బాదుల్లా, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లో చైతన్యం రావాలి

మార్కాపురం రూరల్: వారం రోజులుగా సోషల్ మీడియాల్లో, టీవీల్లో ప్రసారమవుతున్న ఎండోమెంటు అసిస్టెంటు కమిషనర్ శాంతి సంఘటనలను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఖండించాలని దళిత సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ చిట్టెం మార్కు కోరారు. ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ శాంతిని టీవీల్లో, సోషల్‌మీడియాల్లో ఆమెపైన చేస్తున్న విమర్శలను ఎస్సీ, ఎస్టీలు తిప్పికొట్టాలని, ఈ సంఘటనతోనైనా దళితులందరూ ఒకే వేదికపైకి వచ్చి ముక్తకంఠంతో ఖండించాలని లేదంటే భవిష్యత్తులో ఎస్టీలు ఉద్యోగాలు చేయాలంటేనే భయపడాల్సిన పరిస్థితి వస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్టీ కులానికి చెందిన శాంతిని టార్గెట్ చేస్తూ విషప్రచారం చేస్తున్న సంఘటనను అగ్రవర్ణాల దాడిగా పరిగణించాలని ఆయన అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లో చైతన్యం ద్వారానే ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని మార్కు తెలిపారు.

రేపు ఆలయ భూములకు కౌలు వేలం

పెద్దారవీడు: మండలంలో చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన పుణ్యక్షేత్రం శ్రీ తిరుమలనాథస్వామి ఆలయం భూముల కౌలు వేలం పాట 19వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఈదుల చెన్నకేశవ రెడ్డి బుధవారం తెలిపారు. వేలం పాట ఆయా గ్రామాల రామాలయాల వద్ద జరగనున్నట్లు వివరించారు. ప్రతి పాటదారుడు పాటకు ముందుగా రూ.2 వేలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలని, పాట పూర్తైన వెంటనే ఒక ఏడాది ముందుగా మక్తా చెల్లించాలని, అలా చెల్లించకుంటే ధరావత్తు ఫర్ ఫీట్ చేయబడునని, తిరిగి బహిరంగ వేలం పాట నిర్వహిస్తారని, దేవస్థానానికి బకాయిలు ఉన్న వారు గానీ దేవస్థానములో ఎట్టి లావాదేవీలు ఉన్న వారు గానీ వేలం పాటలో పాల్గొనేందుకు అర్హులుకారని, పూర్తి వివరాలకు 80999 49996 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

శాస్త్రోక్తంగా తొలి ఏకాదశి పూజలు



సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న దంపతులు



భగవద్గీత పారాయణలో పాల్గొన్న మహిళా భక్తులు

● భక్తులతో కిటకిటలాడిన వైష్ణవ దేవాలయాలు

ఒంగోలు మెట్రో: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం ఆలయాల్లో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. వైష్ణవ దేవాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక గాంధీ రోడ్డు వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఉదయం పది గంటలకు సామూహిక శ్రీ సత్యనారాయణస్వామివారి వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద పండితుడు సాయికృష్ణ వ్రతాన్ని జరిపించారు. శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో భక్త బృందం ఏర్పాటు చేసిన తొలి ఏకాదశి పూజా కార్యక్రమాలలో భాగంగా శ్రీ సత్యనారాయణస్వామి సామూహిక వ్రతం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో దంపతులు పాల్గొన్నారు.

అనంత కోదండరామస్వామికి ప్రత్యేక పూజలు...

తొలి ఏకాదశి పండుగ సందర్భంగా స్థానిక పీవీఆర్ గర్ల్స్ హైస్కూల్ వద్ద ఉన్న అనంత కోదండరామస్వామి ఆలయంలో ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం ఏడు గంటలకు రామలక్ష్మణసీతాహనుమత్ మూలవిరాట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి ఆశీసులు అందుకున్నారు.

తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఒంగోలు కేశవస్వామిపేటలో గల శ్రీ సత్యనారాయణ స్వామివారి దేవస్థాన ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీ రమావసుంధర సమేత సత్యనారాయణస్వామి మూలవిరాట్లను సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వేదికపై ప్రతిష్ఠించి భక్తులతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని చక్కగా ఆచరింపజేశారు. అర్చకుడు శ్రీధరాచార్యులు, ఆలయ కార్యనిర్వహణాధికారి రజనీకుమారి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



కేశవస్వామిపేటలో సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న దంపతులు



ప్రత్యేక అలంకరణలో రమావసుంధర సమేత సత్యనారాయణస్వామి

భక్తిశ్రద్ధలతో పీర్ల నిమజ్జనం



నిమజ్జనం సందర్భంగా పీర్లతో గ్రామోత్సవం



హజరత్‌గూడెం గ్రామోత్సవంలో పీర్లు

బేస్తవారిపేట: మండలంలోని పలు గ్రామాల్లో పెద్ద సరిగెత్తు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లచావిడి వద్ద అగ్నిగుండం ఏర్పాటు చేశారు. పీర్లతో అర్ధరాత్రి నుంచి గ్రామోత్సవం నిర్వహించారు. బేస్తవారిపేట, పాపాయిపల్లె, చింతలపాలెం గ్రామాల్లో సాయంత్రం మేళ, తాళాలతో కన్నుల పండువగా గ్రామంలోని పురవీధుల్లో ఊరేగింపుగా నిమజ్జనం కోసం తరలించారు. సోమవారిపేట సమీపంలోని చీతిరేల కతువ వద్ద నిమజ్జనం చేశారు.

ఘనంగా పీర్ల గ్రామోత్సవం

కంభం: మొహర్రం బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని హజరత్‌గూడెంలో మంగళవారం రాత్రి పెద్ద సరిగేసు నిర్వహించగా బుధవారం సాయంత్రం పారువేట కార్యక్రమం నిర్వహించారు. పీర్లచావిడి నుంచి పీర్లను గ్రామోత్సవంగా చింతలపాలెం వద్ద ఉన్న కత్వవరకు తీసుకొచ్చి అక్కడ ప్రార్థనలు నిర్వహించారు. గ్రామోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

కురిచేడు: కులమతాలకతీతంగా నిర్వహించుకునే మొహర్రం పండగను అత్యంత భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. మంగళవారం రాత్రి పెద్ద షెరగత్ సందర్భంగా అగ్నిగుండ ప్రవేశం చేశారు. భక్తుల సౌకర్యార్థం నిర్వహకులు అన్నదాన కార్యక్రమాలు, పాటకచేరిలు ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం గ్రామంలోని నాలుగు చావిడీల పీర్లు గ్రామం సెంటర్లో సలాం అందుకోవటం అనే కార్యక్రమం చాలా ఆసక్తిగా ఉంటుంది. కార్యక్రమంలో భక్తులు పాల్గొని పీర్లు సలాం అందుకునే కార్యక్రమం తిలకించారు. అనంతరం పీర్లు చావిడీలకు బయల్దేరి వెళ్లాయి. బుధవారం తిరిగి నాలుగు చావిడీల పీర్లు గ్రామంలోని శ్రీ కోదండరామాలయం వద్ద మూడు రోడ్ల కూడలిలో సలాం అందుకుని అక్కడి నుంచి రైల్వేస్టేషను వద్ద పెద్ద చెరువుకు వెళ్లి నీటిలో కలపడంతో ఈ తతంగం ముగుస్తుంది.

ముండ్లమూరు: మొహర్రం పర్వదినాన్ని మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మత సామరస్యానికి ప్రతీకగా జరుపుకునే మొహర్రం పండగను ప్రజలు కులమతాలకు అతీతంగా పాల్గొని పీర్ల మిలాకత్ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మండలంలోని పులిపాడు గ్రామంలో పీర్ల చావిడి వద్ద నుంచి భక్తులు పీర్లను ఎత్తుకొని మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. పీర్ల ఊరేగింపు సందర్భంగా మహిళలు పీర్లకు నీరు పోసి షరబత్తులు సమర్పించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు. యువకులు ఉత్సాహంగా ఊరేగింపు కార్యక్రమంలో వివిధ రకాల వేషధారణలో పాల్గొన్నారు.

పుల్లలచెరువు: మండల కేంద్రంలో మొహర్రం బుధవారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజులు చిన్ని సరిగేత్, పెద్ద సరిగేత్‌లు నిర్వహించి పీర్లును ఊరేగించారు. మొహర్రం రోజు సాయంత్రం వేళ పీర్లును పుర వీధుల నుంచి ఊరేగింపు నిర్వహించి జలసమాధి చేయడంతో పీర్ల పండుగ ముగుస్తుంది. ఈ సందర్భంగా భక్తులు విచిత్రవేషాలు ధరించి వేడుకలను ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా భక్తులు పాల్గొని ఈ పండుగను తిలకిస్తారు.

కనులపండువగా కల్యాణోత్సవం



విశిష్ట అలంకరణలో సీతా, రామ, లక్ష్మణ, హనుమంత మూల విగ్రహ మూర్తులు



గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

పామూరు: పామూరు అంకాళమ్మవీధి సమీపంలోని వడ్డెపాలెం కోదండరామస్వామి తిరునాళ్ల సందర్భంగా స్వామి శాంతి కల్యాణం అర్చకుల వేదమంత్రాల నడుమ బుధవారం కన్నుల పండువగా సాగింది. ఈ సందర్భంగా అర్చకులు మొదట సీతా, రామ, లక్ష్మణ, హనుమంత మూల విగ్రహమూర్తులకు అభిషేకం, విశిష్ట పూజలు చేశారు. అనంతరం సీతా, రమా చంద్రమూర్తుల విగ్రహమూర్తులకు వేడుకగా ఎదురుకోల నిర్వహించి కల్యాణ మండపానికి చేర్చారు. అనంతరం రుత్వికులు వేదమంత్రాలతో శాంతి కల్యాణం జరిపించారు. కల్యాణానంతరం సాయంత్రం స్వామివార్ల ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అన్నదానం నిర్వహించారు.

టీఆర్ఆర్ కళాశాలకు అటానమస్ హోదా

కందుకూరు: టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) 2024–25 విద్యా సంవత్సరం నుంచి అటానమస్ (స్వయం ప్రతిపత్తి) హోదా ఇచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రవికుమార్ తెలిపారు. ఈ అటానమస్ హోదా 10 ఏళ్ల పాటు అమల్లో ఉంటుందని తెలిపారు. అటానమస్ హోదా రావడం వల్ల కళాశాల మరింత అభివృద్ధి చెందడంతో పాటు విద్యార్థి జ్ఞానాన్ని, ఉపాధి కల్పన నైపుణ్యాన్ని మరింతగా పెంపొందించడానికి దోహదపడుతుందని తెలియజేశారు. ఈ హోదా వల్ల కళాశాల తమ సిలబస్‌ను తామే రూపొందించుకునే అవకాశం ఉందని, విద్యార్థులకు ఉపయోగపడే అనేక నూతన కోర్సులు ప్రవేశపెట్టి వారిని నూతన సమాజ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దవచ్చని వివరించారు. ఈ విద్యా సంవత్సరంలోనే రాష్ట్రంలోనే



టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

అత్యధిక సీజీపీ 3.44 స్కోరుతో నాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించడం, అటానమస్ హోదా సాధించడం కళాశాల ప్రతిభా పాటవాలకు గీటురాయిని అన్నారు. ఈ అటానమస్ సాధించడానికి దోహదపడిన విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి, కళాశాల పూర్వ విద్యార్థులకు, సహకరించిన ప్రజాప్రతినిధులకు ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

పొదిలి విద్యార్థులకు చెస్‌లో బంగారు పతకాలు

పొదిలి: దర్శిలో ఏపీ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో చెస్ పోటీలు జరిగాయి. పొదిలికి చెందిన విద్యార్థులు దర్శి భాష్యం పాఠశాలలో చదువుకుంటున్నారు. పొదిలి బేసిక్ చెస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న సామి నిహాల్ సువిత్, సామి విహాల్ సువిత్ సోదరులు ఈ పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు సాధించారు. వీరికి పాఠశాల ప్రిన్సిపల్ జగదీష్ చేతుల మీదుగా బంగారు పతకాలు, సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. విజేతలను తల్లిదండ్రులు, బంధువులు, మిత్రులు, అకాడమీ నిర్వాహకులు అభినందించారు.

సబ్సిడీ బియ్యం, కందిపప్పు కౌంటర్ ఏర్పాటు

ఉలవపాడు: ధరల నియంత్రణలో భాగంగా స్థానిక సాయి జనరల్ స్టోర్ వద్ద సబ్సిడీ పై బియ్యం, కందిపప్పు అమ్మకాల కౌంటర్‌ను ఏర్పాటుచేసినట్లు తహశీల్దార్ చంద్రారెడ్డి తెలిపారు. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వినియోగదారుల సౌకర్యార్థం అంబేద్కర్ బొమ్మ వెనుక ఉన్న సాయి జనరల్ స్టోర్ వద్ద ఈ కౌంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశవాళీ కంది పప్పు మార్కెట్‌లో రూ.181 ఉండగా ఈ కౌంటర్‌లో రూ.160 అమ్మనున్నట్లు పేర్కొన్నారు. బీపీటీ బియ్యం మార్కెట్‌లో 55.85 ఉండగా ఈ కౌంటర్ వద్ద రూ.49 రాబియ్యం మార్కెట్ లో రూ.52.40 ఉండగా కౌంటర్ వద్ద రూ.48లకు అందిస్తామన్నారు. వినియోగదారులు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

టంగుటూరు: మండలంలోని కందులూరు గ్రామంలో సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ప్రకృతి వ్యవసాయం ద్వారా అడుసుపల్లి సుజాత అనే రైతు 30 సెంట్ల స్థలంలో 30 రకాల కూరగాయలు పండించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో కూరగాయల ధరలు అధికంగా ఉన్నాయని తెలిపారు. పలు రకాల రసాయనాలతో పంటలు పండిస్తూ ఆ కూరగాయలు తినడం వలన ప్రజలు అనారోగ్యానికి గురవుతున్న విషయం అందరికీ తెలుసన్నారు. తనకున్న 30 సెంట్లలో పలు రకాల కూరగాయలను రసాయనాలు లేకుండా ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించడం జరుగుతోందన్నారు. యూనిట్ ఇన్‌చార్జి తుమ్మలపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ కూరగాయలు, ఆకుకూరలు ప్రకృతి విధానంలో సాగు చేస్తే ఆరోగ్యకరమైన కూరగాయలు తింటూ అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అదే విధంగా అధికంగా పండించిన పంటను బయట అమ్ముకుంటూ జీవనం సాగించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు ఐసీఆర్‌పీ మరియమ్మ, హరిత, జోత్స్న, త్రివేణి, రైతులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

చదువుతోనే పేదరిక నిర్మూలన



స్టిక్కర్లు ఆవిష్కరిస్తున్న వలిబాబు, తదితరులు

ఒంగోలు టౌన్: పేదరికాన్ని నిర్మూలించే శక్తి ఒక్క చదువుకు మాత్రమే ఉందని జీజీహెచ్ న్యూరోసర్జన్ డాక్టర్ వలిబాబు షేక్ అన్నారు. ఇన్సాఫ్ రాష్ట్ర ఆధ్వర్యంలో రూపొందించిన ముస్లిం స్వాతంత్ర పోరాట యోధుల చరిత్రను వివరించే నోట్ బుక్ స్టిక్కర్లను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చదువుతోనే అనుకున్న లక్ష్యాన్ని సాధించడం సాధ్యమవుతుందన్నారు. జాతీయోద్యమంలో ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన పోరాట యోధుల నుంచి స్పూర్తి పొంది జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలని సూచించారు. బాధ్యత కలిగిన పౌరులుగా మెలగాలని, చదువు, క్రీడలో రాణిస్తూ తలిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. బాల్యంలో ఎన్నో కష్టాలు అనుభవించిన ఎంతో మంది చదువుల ద్వారానే పారిశ్రామికవేత్తలుగా, శాస్త్రవేత్తలుగా ఎదిగి దేశానికి ఎనలేని సేవలు చేశారని అన్నారు. ఇన్సాఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ సాలార్, ముస్లిం సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాదర్‌వలి, రిటైర్డ్ ఎస్ఐ షేక్ ఖాశీం, షేక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బెల్లం స్థానం తిరునాళ్ల



శివలింగానికి పూజ చేస్తున్న పూజారి



కొండకు చేరుకుంటున్న భక్తులు

దొనకొండ: మండలంలోని ఇండ్లచెరువు పంచాయతీ పరిధి పోచమక్కపల్లి రెవెన్యూలోని బెల్లం స్థానం కొండపై తిరునాళ్ల బుధవారం భక్తులు వైభవంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలు ఇండ్లచెరువు, భూమనపల్లి, పిచ్చిగుంట్లపల్లి, పడమరపల్లి, గజ్జలకొండ, మాలపాటిపల్లి, కలివెలపల్లి తదితర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కొండపై వెలసిన శివపార్వతి, ఆంజనేయస్వాములను పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. ఏటా తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు బెల్లం స్థానం కొండపై తిరనాళ్ల జరుపుకుంటారు. ఆడపడుచులు వారి మొక్కులు చెల్లించుకుంటారు. తిరునాళ్లకు వచ్చిన భక్తులకు దాతలు అన్నదానం చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మూడో రోజుకు చేరిన నిరాహార దీక్షలు



దీక్షకు మద్దతు తెలుపుతున్న నాయకులు

పొదిలి: స్థానిక ఆర్టీసీ డిపోలో కార్మికుల పట్ల యాజమాన్యం మొండి వైఖరికి నిరసనగా ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈక్రమంలో నిరాహార దీక్షలు చేస్తున్నారు. ఈ దీక్షలు బుధవారంతో మూడో రోజుకు చేరాయి. డిపో సెక్రటరీ ఓబులేసు, యుఎస్.రావు ఆధ్వర్యంలో జరుగుతున్న దీక్షల్లో డిఎం.దాసు, భీమయ్య, కొండలు కూర్చున్నారు. సీసీఎస్ డెలిగేట్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బి.సాంబశివరావు దండలు వేసి దీక్షను ప్రారంభించారు. డిపోలో అధికారులు వ్యవహరిస్తున్న తీరును నాయకులు తమ ప్రసంగాల్లో ఎండగట్టారు. డిపోలో జరుగుతున్న లోపాలపై తగు విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకునేంత వరకు నిరాహార దీక్షలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, కార్యవర్గ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే అన్నా పరామర్శ



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

కంభం: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన జంగంగుంట్ల గ్రామానికి చెందిన దేశిరెడ్డి సుబ్బారెడ్డి, అనారోగ్యంతో మృతి చెందిన సబ్బసాని అంకమ్మ కుటుంబ సభ్యులను బుధవారం గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు బుధవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యంగా ఉండాలని చెప్పారు. ఆయన వెంట మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి, పాలగిరి శరభారెడ్డి, సబ్బసాని సాంబశివారెడ్డి ఉన్నారు.